క్లుప్తంగా

ఆధార్ క్యాంపులు వాయిదా

ఎంపీడీఓ అనూహ్య

ఘంటసాల: మండలంలో మంగళవారం నుంచి జరగాల్సిన ఆధార్ క్యాంపులు వాయిదా వేసినట్లు ఎంపీడీఓ టి.అనూహ్య తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం నుంచి శనివారం వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే ఆధార్ సర్వీస్‌లో ఎక్కువ మోతాదులో రిజెక్ట్ అవుతున్నందున ఆధార్ ఆపరేటర్లకు ఆన్‌లైన్ రీఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలో మరలా ఎప్పుడు ఆధార్ క్యాంపులు నిర్వహించేది షెడ్యూల్ విడుదల చేస్తామని ఎంపీడీఓ అనూహ్య చెప్పారు.

శ్రీబాలా పార్వతీ అమ్మవార్లకు శత సహస్ర గాజుల అలంకరణ



టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో ఉన్న శ్రీ బాలా పార్వతీ సమేత రామేశ్వర స్వామివారి దేవస్థానంలో అమ్మవారికి శత సహస్ర గాజుల అలంకరణ నిర్వహించారు. శ్రావణ పూర్ణిమ సందర్భంగా సోమవారం ఉదయం అమ్మవారికి అష్టోత్తర నామాలతో ప్రత్యేక పూజలు, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సమర్పించిన గాజులతో శ్రీ బాలా పార్వతీ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రసాయన రహిత వ్యవసాయంపై మెలకువలు



పెదకళ్లేపల్లి(మోపిదేవి): రసాయన రహిత వ్యవసాయంపై ప్రతి రైతు అవగాహన, మెలకువలు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి తెలిపారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో సోమవారం సాయంత్రం పొలంబడి కార్యక్రమం రైతు అరజా మల్లికార్జునరావు పొలంలో నిర్వహించారు. రసాయన రహిత వ్యవసాయంలో ఉపయోగాలు, మెలకువలు వివరించారు. అనంతరం పొలం గట్ల మీద బంతి మొక్కలు ట్రాప్‌గా నాటించారు. వీపీఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



పెడన: మండల పరిధిలోని కమలాపురం గ్రామ పంచాయతీ శివారు ఉప్పలకలవ గుంటపాలెం గ్రామానికి చెందిన రాజులపాటి చిట్టెమ్మ (102) సోమవారం మృతిచెందారు. ఈమె తల్లి మట్టాశాయమ్మ కూడా వంద సంవత్సరాలకు పైగా జీవించారని బంధువులు, గ్రామస్తులు చెబుతున్నారు. చిట్టెమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, ఆరుగురు మనవళ్లు, నలుగురు మనవరాళ్లు, ఇద్దరు మునిమనవళ్లు ఉన్నారు.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెడన: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదిన్నర గంటలకు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం హాలులో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, సంబంధిత శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ కనకదుర్గమ్మ సన్నిధిలో సోమవారం కళాకారిణులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను తన్మయులను చేశాయి. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో రోజూ నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం కళావేదికపై జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. నగరానికి చెందిన శ్రీనటరాజ సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో చెన్నంశెట్టి మోహన్విత బృందం మూషిక వాహన వినాయక స్తుతితో ప్రారంభించారు. పలు అంశాలకు కళాకారిణులు చక్కని ఆహార్యం, అభినయంతో నర్తించారు.

అనాథలా పెడన ఏఓ కార్యాలయం

- బాధ్యతలను అప్పగించని నస్పెండైన ఎంఏవో
- జిల్లా అధికారి ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న ఇన్‌చార్జి ఎంఏవో
- ఈ–క్రాప్, ఈకేవైసీలు సెప్టెంబరు 15లోగా పూర్తి చేయాలని ఆదేశాలు
- పర్యవేక్షించే అధికారి లేక మండల వ్యవసాయశాఖ అతలాకుతలం

ఆయన ఇవ్వరు...ఈమె తీసుకోరు!





పెడన ఏవో కార్యాలయం
(ఇన్‌సెట్‌లో) పెడన ఏవో కార్యాలయంలో తాళాలు వేసి ఉన్న ఏవో, సిబ్బంది చాంబర్లు

పెడన: అత్యంత కీలకమైన వ్యవసాయ శాఖలో మండల స్థాయిలో ఉన్నతాధికారి లేకపోవడంతో ఆ వ్యవస్థ అయోమయంగా మారింది. వీఏఏలు, ఎంపీఈవోలు ఎవరెటు వెళ్తున్నారు..ఏం చేస్తున్నారనే దానిపై ఆయా రైతు సేవా కేంద్రాల్లో సరైన సమాచారం లేదు. మిచాంగ్ నష్టపరిహారం పంపిణీలో జరిగిన అవకతవకల విషయంలో మండల వ్యవసాయశాఖ అధికారిగా ఉన్న జీవీ శ్రీనివాసరావును ఉన్నతాధికారులు సస్పెండ్ చేసి నెలరోజులు పైనే అయింది. ఆయన స్థానంలో మచిలీపట్నం అగ్రి ల్యాబ్‌లో విధులు నిర్వహించే నూరున్నీసాకు పెడన మండల ఏవో బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా వ్యవసాయశాఖ అధికారి పద్మావతి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ వరకు పరిస్థితి బాగానే ఉంది. అయితే నూరున్నీసా పెడన ఇన్‌చార్జి ఏవోగా బాధ్యతలను తీసుకోకుండా పైపైన పనులు ఏమైనా ఉంటే సరిపెడుతూ కాలం నెట్టుకువస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే తనకు పాత ఏవో బాధ్యతలను అప్పగించలేదనే సాకు చెబుతున్నారు. అయితే జిల్లా అధికారి ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ ఇప్పటివరకు బాధ్యతలను చేపట్టకపోవడంపై జిల్లా అధికారులు కూడా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ–క్రాప్..ఈకేవైసీలు...

ప్రస్తుతం ఖరీఫ్ సాగు సమయం కావడంతో రైతులకు సంబంధించి వీఏఏలు, ఎంపీఈవోలకు పనిభారం ఏర్పడింది. ఈ–క్రాప్, ఈకేవైసీలు అయితేనే సదరు రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ–క్రాప్‌లో ఏమైనా పొరపాట్లు చోటుచేసుకున్నా, చేయించకపోయినా రైతులు ఇబ్బందులు పడే దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వీఏఏలు, ఎంపీఈవోలు రైతు సేవా కేంద్రాల సమీపంలోని తమకు సంబంధించిన రైతుల వివరాలను ఈ–క్రాప్, ఈకేవైసీలు చేయించాలి. వీరు సక్రమంగా చేస్తున్నారా లేదా అనే విషయాలపై ఏవో ఆరా తీస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నివేదికలు సరిచూసుకుంటుండాలి. కాని ప్రస్తుతం మండలంలో ఈ పరిస్థితి లేదు. కారణం వీఏఏలు రైతు సేవా కేంద్రాల వద్ద సక్రమంగా ఉండటం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఏవో కార్యాలయానికి అని చెప్పి...ఎక్కడికో...

ప్రస్తుతం ఇన్‌చార్జి ఏవో మండల కేంద్రానికి రాకపోవడం, బాధ్యతలను చేపట్టకపోవడంతో పనిదినాలలో రోజుకు వీఏఏలు, ఎంపీఈవోలు ఎవరైనా ఇద్దరు చొప్పున ఏవో కార్యాలయంలో విధులు నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు. అయితే వీరు వస్తుందీ లేనిది కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. రైతు సేవా కేంద్రం వద్ద ఆరా తీస్తే మండల కేంద్రానికి వెళ్లారని చెబుతున్నారు. తీరా ఏవో కార్యాలయానికి వెళ్తే అక్కడ తాళం వేసి ఉంటుంది. కొందరు ఉదయం ఏవో కార్యాలయానికి వచ్చి మధ్యాహ్నం నుంచి తమ సచివాలయ పరిధిలో ఈ–క్రాప్ చేయడానికి వెళ్లిపోతున్నారు. దీంతో ఏవో కార్యాలయంలో పూర్తిగా ఎవరూ అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కమిషనర్ కార్యాలయానికి తెలియజేశాం



పెడన మండల వ్యవసాయశాఖ పరిస్థితిని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి తెలియజేశాం. ఇన్‌చార్జి ఎంఏవోగా నూరున్నీసా బాధ్యతలను తీసుకోవడం లేదు. అదేమని ప్రశ్నిస్తే నాలుగైదు బాధ్యతలున్నాయని అంటున్నారు.

– ఎస్.పద్మావతి,
జిల్లా వ్యవసాయశాఖాధికారి, మచిలీపట్నం

బ్యాంకు ఖాతాలు సీజ్..ఎక్కడికి వెళ్లాలో...

మిచాంగ్ నష్టపరిహారం పంపిణీలో జరిగిన అవకతవకల నేపథ్యంలో రైతులు కాని వారికి నష్టపరిహారం వారి బ్యాంకు ఖాతాలకు జమ కావడంతో అటువంటి వారి బ్యాంకు ఖాతాలను సీజ్ చేయాలని వ్యవసాయశాఖ అధికారులు బ్యాంకులకు సమాచారం ఇచ్చారు. తమ ఖాతా రన్నింగ్‌లోకి రావాలంటే వ్యవసాయశాఖ అధికారుల నుంచి లిఖితపూర్వకంగా లెటర్ తెచ్చుకోవాలంటున్నారు. ప్రస్తుతం మండల ఏవో కార్యాలయంలో ఎవరూ ఉండని దుస్థితి. దీంతో జిల్లా కేంద్రానికి పరుగెత్తాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు.

ఎమ్మెల్యే కాగితకు విద్యార్థినుల రాఖీ



పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

బంటుమిల్లి: పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీసాబూ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చిన్నారులకు మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో అన్నదమ్ములకు అక్కచెల్లెమ్మలు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అన్నదమ్ములు అక్కచెల్లెమ్మలకు కానుకలు, నూతన వస్త్రాలతో సత్కరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో...

మండల పరిధిలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మానికి, దేశ రక్షణకు బద్ధులమై ఉంటామని పేర్కొంటూ స్వయం సేవకులు భగవధ్వజానికి(కాషాయజెండా) రాఖీలు కట్టి ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదికలో

రూ.1.69 లక్షలు రికవరీ

డీఎల్‌డీవో నాంచారరావు వెల్లడి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మల్లికార్జునరావు, చిత్రంలో డీఎల్‌డీఓ నాంచారరావు, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు

మోపిదేవి: విధుల నిర్వహణలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తప్పుచేస్తే శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎంపీపీ నడకుదుటి జననీకుమారి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల వత్తిడికి తల ఒగ్గితే ఆ తప్పుకు అధికారులే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వత్తిడులకు గురికాకుండా అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ డీఎల్‌డీవో ఎల్.నాంచారరావు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వివిధ గ్రామాల్లో జరిగిన పనులపై ఈ నెల 7 నుంచి 19వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సామాజిక తనిఖీ నివేదికలపై మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక సభ నిర్వహించామన్నారు. ఈ తనిఖీలలో మండల పరిధిలో జరిగిన 1,045 పనులకు గానూ రూ.7,38,54,366 వెచ్చించినట్లు తెలిపారు. ఇందులో మెటీరియల్ రూపంలో రూ.1,74,65,661, వేతనాల రూపంలో రూ.5,63,88,706 చెల్లించినట్టు వివరించారు. సామాజిక తనిఖీ బృందం పరిశీలనలో రూ.1,69,367 రికవరీగా గుర్తించామన్నారు. రూ.1,250 జరిమానాగా విధించినట్లు తెలిపారు. రెక్టిఫికేషన్ కింద రూ.25,87,393గా గుర్తించినట్లు వివరించారు. ఈ రెక్టిఫికేషన్‌ను విజిలెన్స్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు మరోసారి పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని వివరించారు. ఏరియా కో–ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ మండలంలో వివిధ రూపాల్లో సామాజిక పింఛన్లు పొందుతున్న 106 మందిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 76 మంది సాధారణ పింఛనుదారులే కాకుండా చర్మ కళాకారులు 14 మంది, అంగన్‌వాడీ ఆయాలు, ఆశ వర్కర్లు, బుక్‌కీపర్లు ఐదుగురు, మృతి చెందినవారు 11 మంది ఉన్నట్టు తనిఖీ బృందం గుర్తించిందన్నారు. వీరిపై మరోసారి విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించినట్లు వివరించారు. ఎస్‌ఆర్పీ సత్యనారాయణ, ఎంపీడీవో రామలింగేశ్వరావు, అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, విజిలెన్స్ ప్రతినిధి సురేష్, ఏపీవో రవి కుమార్, ఏపీఎం శ్రీనివాస్, టీఏ హరిబాబు నాయక్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంతకముందు ప్రభుత్వ సచివాలయాలు రోడ్ల నిర్మాణానికి వెచ్చించిన రూ.1.86 లక్షలు, 540 సిమెంట్ కట్టలు దారి మళ్లినట్లు, వీటిని రికవరీ చేయవలసిందిగా సంబంధిత కాంట్రాక్టర్ డీఎల్‌డీవోను కోరారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తమకు జాబ్‌కార్డు ఉన్నా ఉపాధి కల్పించడం లేదని మేరుగు సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు వారాలు పని చేయించుకుని రెండు వారాలకు మాత్రమే వేతనం చెల్లించారని, తనకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించి పనిదినాలు కల్పించాలని విన్నవించారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

కృత్తివెన్ను: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాల్సిందిగా ఎంపీడీవో వి.రాంబాబు విజ్ఞప్తిచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, పక్కా డ్రయినేజీ వ్యవస్థ, పశువులు, మేకల షెడ్లు నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో వాటి పనుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గుర్తించిన పనులకు గ్రామ సభలలో ఆమోదం పొందాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీవో హర్షవర్ధన్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

కోనేరుసెంటర్: తాళాలు పెట్టి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మచిలీపట్నం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ ఏసుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం బచ్చుపేటకు చెందిన శీరం సత్య సూర్యకుమారి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త రాధాకృష్ణ ప్రభుత్వం ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. నాలుగు నెలల క్రితం భార్యభర్తలు కలిసి కెనడాలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. రాధాకృష్ణ ఆరోగ్యం క్షీణించటంతో ఈ నెల 10వ తేదీన ఇండియాకు తిరిగి వచ్చారు, విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా రాధాకృష్ణ చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా ఈ నెల 17వ తేదీన సత్యసూర్యకుమారి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించారు. విషయాన్ని విజయవాడలో ఉన్న సూర్యకుమారికి ఫోన్ చేసి జరిగింది చెప్పారు. దీంతో సూర్యకుమారి మచిలీపట్నం వచ్చి చూడగా బీరువాలో ఉండాల్సిన బ్రేస్లెట్, చెవిదిద్దులు, మరికొన్ని బంగారు వస్తువులు కనిపించలేదు. చోరీ జరిగినట్టు గ్రహించిన ఆమె మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది నిందితుల వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ అనుమానితుల ఆచూకీ కోసం గాలించింది. అపహరణకు గురైన బంగారు ఆభరణాలు సుమారు రూ.75,000 ఖరీదు వరకు ఉంటాయని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక లక్ష్మీగణపతి హోమం

పెడన: పట్టణంలోని పాతపేటలో ఉన్న శ్రీముత్యాలమ్మ తల్లి ఘతం (పైడమ్మ)అమ్మవారి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సామూహిక లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమాలను నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించగా 3వేల మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు, పాతపేట భక్త బృందం, సేవాదళ్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శిక్షణ తరగతులను సద్వినియోగించుకోండి



శిక్షణ తరగతులను హాజరై రిజిస్టర్లు పరిశీలిస్తున్న సీతామహాలక్ష్మి

గూడూరు: బోధనలో సులువైన పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగించుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఉర్దూ ఏఏఎంఓ జి.సీతామహాలక్ష్మి కోరారు. గూడూరు నగరంపేటలో నిర్వహిస్తున్న ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మాధ్యమం ఏదైనా విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరగాలన్న లక్ష్యంతో కాంప్లెక్స్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గూడూరు, పామర్రు, మొవ్వ మండలాలకు చెందిన ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులలో కాంప్లెక్స్ చైర్మన్ షేక్ అలీ, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ ఒడుగు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

మంత్రి కొల్లు రవీంద్ర



కెమెరా సృష్టికర్త డాగూరే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్: ప్రతిరోజూ ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్న ఫొటోగ్రఫీలోని నూతన టెక్నాలజీని ఫొటోగ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం మచిలీపట్నం డివిజన్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా పరిషత్ సెంటర్ సమీపంలోని కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్వెస్ మండే డాగూరే కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన మహిళల ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు బండి రామకృష్ణ, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, నాలుగో డివిజన్ కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, న్యాయవాది ఎల్.బాలాజీ, మచిలీపట్నం డివిజన్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి కల్యాణోత్సవం



పులిగడ్డలో స్వామివారికి అభిషేకాలు

అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకుడు ధన్వంతరాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు వికనాచార్యులు స్వామివారికి పంచామృత, గోక్షీర అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెండి పట్టు వస్త్రాలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ వేడుకలను తిలకించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వ్యాసమునీంద్ర జయంతి

స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వ్యాస మునీంద్ర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి, వ్యాస జయంతిని పురస్కరించుకుని వ్యాస మునీంద్ర, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అన్న సమారాధాన నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి రఘు, అప్పలాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేయగా, ధన్వంతరాచార్యులు, పార్థసారథి ఆచార్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చకచకా గోటకం రహదార్ల నిర్మాణం

పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి 8 రోడ్ల అభివృద్ధి



గోటకంలోని 8 వ నంబరు రోడ్డులో రబ్బీసు వేస్తున్న కూలీలు

ఘంటసాల: గోటకం కాలనీలోని రోడ్లకు మోక్షం కలిగింది. ఘంటసాల పంచాయతీ పరిధిలోని గోటకం కాలనీ, పెద్దగూడెం, పిడుగువానిపల్లె వాసులు మట్టి రోడ్లతో కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి గోటకం కాలనీలోని 8, 20 నంబర్ల రోడ్లతో పాటు పెద్దగూడెం, పిడుగువానిపల్లె గ్రామాల్లోని మొత్తం ఎనిమిది రోడ్లకు రబ్బీసు తరలించి పాలకవర్గ సభ్యులు రోడ్లు వేయిస్తున్నట్లు ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్ సోమవారం తెలిపారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షాలు కురిస్తే నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేందని, ఇప్పుడు రోడ్లు వేయడంతో ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలి



ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్యాలయం ఉద్యోగి, ఏఎన్‌ఎంలు

పెడన: పట్టణంలో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలని, జ్వరాలు ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య ఆదేశాలు జారీ చేశారు. దీంతో వార్డు సచివాలయాల్లోని సిబ్బంది ఉరుకులు పరుగులు తీస్తున్నారు. వీరిపై మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు సీనియర్ అసిస్టెంట్లను, జూనియర్ అసిస్టెంట్లను నియమించడంతో సచివాలయ ఉద్యోగులు సర్వే చేస్తున్నదీ లేనిదీ వారు పరిశీలిస్తున్నారు. ఇంటి పరిసరాలను కూడా పరిశీలించి పరిశుభ్రం చేయిస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా ఇదే పనిలో సచివాలయ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. సోమవారం పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో వార్డు శానిటరీ కార్యదర్శులతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వార్డు అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు కూడా సర్వేలో పాలుపంచుకున్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



పెద్దగూడెం ఎంపీపీ స్కూల్లో రాఖీలు కడుతున్న విద్యార్థినులు



అశ్వరావుపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థికి రాఖీ కడుతున్న విద్యార్థిని

అవనిగడ్డ: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో రక్షాబంధన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అశ్వరావుపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో పలువురు విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీలు కట్టారు. పలుచోట్ల సోదరీమణులు సోదరుల ఇళ్లకు వెళ్లి రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అమ్మ, నాన్న ట్రస్టు ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు

ఘంటసాల: ఘంటసాల పెద్దగూడెం ఎంపీపీ స్కూల్లో అమ్మ నాన్న ట్రస్టు అధినేతలు కొడాలి భక్త పాల్, కొడాలి భక్త విజయం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినిలతో విద్యార్థులకు రాఖీలు కట్టించి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.